కవితా కౌముది

# వేటగాడు - గరిమెళ్ళ నాగేశ్వర రావు

పంజరాన్ని ప్రేమించే పిట్టకి
రెక్కల విలువ తెలీదు
నీతి తప్పిన మనిషి నీటిని వదిలిన చేపే!
పట్టిన చేతినే వేటాడడం కత్తి నైజం
నెత్తురు తాగితే ..కక్కక తప్పదు!
మున్నీటి ముంపు కంటె కన్నీటి ముంపుకి
కసి ఎక్కువ!
వేటంటే విల్లంబులు పట్టి
మృగాలవెంట పడే వినోదం కాదు-
ఆకలి చూపులు సంధించే ఆయుధాల గురి!
వేటంటే మృత్యువునోట బ్రతుకు పాడిన వేలంపాట
తల్లడిల్లిన తల్లి గొంతు శృతిచేసే తడిపాట!
గుంటనక్కలని గురి చూసే చావాట!!
జీవితాన్ని ఎరవేసి పాపాలను పట్టుకునే త్యాగాల బాట!
వెంటాడే వాళ్ళను తప్పుకుంటూ వేటని
సాగిస్తోన్నప్పుడు..ప్రాణమే ఒక బాణం!
కాలం బొమ్మాబొరుసులకు మధ్యన
తిరుగుతోన్న ..ఒక నాణెం!
నేనొక వేటగాణ్ణి చూశాను,
ఆయుధాలు పట్టని అద్భుత నైపుణ్యాన్ని చూశాను,
గాయపరచకుండా గురిచూసే గుండె ధైర్యాన్ని చూశాను,
నెత్తురు చిందకుండా మృగాలని తరిమికొట్టిన వేటని చూశాను,
మూడురంగులుగా ఎగురుతోన్న వేటగాడి నవ్వుని చూస్తున్నాను,
ఆ అడుగుల్ని వెదికి పట్టుకు..వేటని మొదలెడదాం..
ఆయుధాలని మార్చుకోవాలి...అర్జంటుగా రా తమ్ముడూ..!

# వర్షం
## రాధిక బుక్కా

యాదృచ్ఛికంగా ఎటో చూసిన నాకు
కనిపించాయి నిన్నటి రాత్రి గుర్తులు
పుడమితల్లి దోసిళ్ళలో నేలజారిన అమృత బిందు సమూహాలు
నీలి మేఘాలు తమంత తామై కరిగి
నింగి నుండి నేలకు వేసిన నీటి నిచ్చెనలుగా
చల్లని స్పర్శల పలకరింపులతో వీస్తున్న గాలి తెమ్మెరలు!
నిత్య యవ్వని ఐన ప్రకృతి కాంత మేనిపై
స్నానమాడగా మిగిలిన ముత్యపు చినుకులు
బాలభానుడి లేలేత కిరణాలతో
మురిసి మెరుస్తున్న వజ్రపు తునకలు

అలవోకగా అటే చూసిన నన్ను
పులకింప చేశాయి నిన్నటి రాత్రి గుర్తులు
సేదతీరి శాంతించాయి నా ఎదకొలనులోని అలజడులు..!!

# నా..ఉగాది
## సి.హెచ్.నాగభూషణ రావు

నా..ఉగాది
సంతోషపు సంవత్సరానికి నాంది పలికే పునాది
ప్రకృతి కమనీయ పచ్చగా వుండాలని
కోయిలమ్మ గీతాలు తెలుగువారికి తియ్యదనం పంచాలని
ఉగాది పచ్చడి కష్ట సుఖాలను గుర్తుచేస్తూ..
ముందుకి..మునుముందుకి..నడిపించాలని
ఇది నా ఉగాది కామన..
కాలకన్య అందించే శుభ దీవెన!
పుడమి తల్లి ఒడిలో
ఆకు రాల్చిన నూతనత్వాన్ని
అంకురం చేసుకునే అందమైన ప్రకృతి ..
తెస్తుంది ఓ ఆకృతి
కాదది మోడు..చిగురించును చూడు..
నా..ఉగాది నాడు!
షడుచుల సమ్మేళనం
కావాలి సర్వజీవులకు ఆనందం
అందరి హృదయాలలో
ఆనందపు కాంతులు నింపాలి ఈ ఉగాది..!
అదే అందరికీ శుభాది..!

## ఈ యుగం .. ఓ దారుణం..

ప్రతాప వెంకట సుబ్బారాయుడు

మంచికి కంచెకట్టి
కాపాడాల్సిన పరిస్థితి
నిజాయితీని మ్యూజియంలో
వీక్షించాల్సిన దుస్థితి
మాటకు..చేతకు పొంతనలేని
కపట సంస్కృతి
నమ్మకం అనేది నామ రూపాల్లేక
మానవత్వం నశించి
మానవ బాంబుగా అవతరించి
నరమేధానికి..పరమఘోరానికీ
నాంది పలుకుతుంటే
రక్తం నిరంతర జీవనదై పారుతుంటే
అడుగడుగునా అంగాంగాలతో
కబేళాగా మారిన భూమిపై
రాక్షసత్వమే తప్ప
వెతికి చూసినా దైవత్వం గోచరిస్తుందా?
రక్తమాంసాల రుచి చూసిన ఈ యుగం
చరిత్రలో ఓ దారుణం..!!

## జీవితం ఓ దీపారాధన

జె.బి.వి.

నే నొక దీపాన్నై
నేనే నొక దీపాన్నై
ఉజ్వలమై , ఉద్భాసితమై
లోలో , నాలో చెలగే
తిమిరావళి నధిగమించి
ఒక దీపం వెలిగిస్తా !
ఆ దీప కళికలో
వెలుగులు చిందించే
ముఖారవిందం కని
మరివొక దీపం వెలిగిస్తా !
మరివొక దీపం
మరివొక దీపం
వేరొక దీపం
ఎన్నో , ఎన్నో
ఎన్నెన్నో దీపాలు వెలిగిస్తా !
జీవితమే దీపారాధన
ఉత్సవంగా మలచుకొంటా !!

# నేను

చెల్లూరు సాంబమూర్తి

నా కళ్ళ క్రింది బావులూ
ఆలోచనా అంతర్వాహినిలూ
ఎపుడో అడుగంటాయి
నా లోని తడితో
దాహం తీర్చుకోవాలనుకోవటం
వృధా ప్రయాస
కలల్ని కౌగలించుకున్నంత మాత్రాన
కొన్ని కోట్ల నయనాలు కురిపించే
కన్నీటి చారికలు చెరిగిపోవు కదా
అశృధారల్లో తడిసి ముద్దవటం తప్ప-
మీరంతా
అంతర్నేత్రాలతో చూట్టం మానేసినపుడు
నా చుట్టూ బిగుసుకుంటున్న
ముల్ల తీగలు కనిపించవు
నిలువెల్లా చిరునవ్వు లేపనం
పూసుకు తిరుగుతున్నా
నాకు మాత్రం తెలుసు
నేను
కాన్సంట్రేషన్ కేంపుల్లో
ఇరుక్కున్న బందీనని!
ఏ రోజుకారోజు నా బ్రతుకు
నేను కొనుక్కోవాలంటే
నన్ను నేను అమ్ముకోవటం
నన్ను నేను కొంచం కొంచం
చంపుకోవటం
తప్పనిసరవుతుంది!
ఎడముఖం పెడముఖమున్న
మూడు మృగాలను
ముద్రించుకొన్నందుకే
ఓ లోహపు బిళ్ళను
ఆత్మీయంగా స్పృశిస్తారే
నిలువెత్తు నాణాన్ని
నా రెండోవైపు చూడరెందుకు
క్రీనీడలో ఉన్నంతమాత్రాన
నాకు రెండోవైపు లేదనుకున్నారా?
సరే
కర్తవ్యం కాలి చుట్టూ పెనవేసుకున్నపుడు
పలాయన మంత్రం పఠించలేను కదా
అందుకే
ఇపుడు నేనో సోమయాజిని
అక్షర యజ్ఞ గుండంలో
సిరా చుక్కల్ని నిరంతరం
జారవిడుస్తూనే ఉంటాను!
నా వ్రేలి కొసలలో
అక్షరాలు పుష్పిస్తాయంటే
నేల పొరల్లో
నిక్షిప్తమవటానికైనా సిద్ధమే.. !!

# నిజంగా మనం
## సత్య

**కలిసుండీ, కలిసిపోలేకుంటే**
విడిపోవడం మంచిది....!
విడిగావుండీ, విడిపోలేకుంటే
కలిసిపోవడం మంచిది...!!

ఎటూతేలక, స్పష్టత లేక,
భవిత తెలీక, పరిణితి లేక,
విషయం తెలిసీ, వివరణ లేక,
నిజాలు తెలిసీ, నిగ్గు తేల్చక,

అగమ్యపయనం-ఎడారియానం
ఎండమావితో తీరదు దాహం!!
మనసులనెరిగీ, మనుషుల అహము!
ముందుతరాలకి తీరని ద్రోహం !!!

# సమన్వయాలు
## నూతక్కి రాఘవేంద్రరావు

**నాడు  ఆనందపు అనుభూతుల**
వింజామరలు
నేడు నిట్టూర్పుల పొగల సెగలు
కాలగమన వేగంలో
వైవిధ్య భరిత అంతరంగ
వ్యత్యాసాల నడుమ నలిగి కనలి
ప్రేమ ఆప్యాయతానురాగాలు.
సున్నిత భావావృత విన్యాసాలు
లోపిస్తున్నాయి ఎక్కడో
సమన్వయాలు
మరుగునపడిన
వుమ్మడి జీవన వాస్తవాలు



## ఓ చందమామ
### జొన్నలగడ్డ నారాయణ మూర్తి

ఓ చందమామ ఓ చందమామ
నింగినుండీ నీవు తొంగిచూడంగానె
పొంగి సాగరుడంత పరవళ్ళు తొక్కాడు
ఓ చందమామ ఓ చందమామ
ఆకాశవీధిలో నీరాక చూసింది
ఆనందమున కలువ మోము వికసించింది
ఓ చందమామ ఓ చందమామ
కోటికాంతుల కొండ వేయి వెలుగుల లోయ
మిలమిలా తళతళా మెరిసిపోయాయి
ఓ చందమామ ఓ చందమామ
నదిలోనపడి నీదు కిరణాలు మెరిశాయి
మదిలోనపడి మధురభావాలు విరిశాయి
ఓ చందమామ ఓ చందమామ
నీ వన్నెచిన్నెలకు ఎన్నెన్నొ హృదయాలు
కలవరింతలతోటి తూలి సోలాయి
ప్రేమనౌకలనెక్కి పయనాలు చేశాయి
ఓ చందమామ ఓ చందమామ
తీరాలు చేరకనె తనివితీరకనె
మబ్బుగుర్రాలపై దబ్బుదబ్బున నీవు
తిరిగివచ్చేసరికి తెల్లారిపోయింది
ఓ చందమామ ఓ చందమామ

## మానవుడే మాధవుడు
### పొదిల రామకృష్ణ

అర్థం అవలేదా చుట్టూ ఉన్న ప్రపంచం?
స్వార్థం తలపాగా చుట్టిన ఈ సమాజం?
తోటి మనిషికి అన్నం, లక్షింతల ఆకలితో పస్తున్నా ఇయ్యం
దేవునికి దణ్ణం అక్షింతల పూజలతో పసుపున్న బియ్యం!
దేవుడట ఆయన!
పాళితోటి ఖాళీగా ఉన్నప్పుడు
నుదిటిరాతలు రాసి వింధ్యామరలతో శయనిస్తాడు!
పేదోడట ఈయన!
గాలి తిని ఆకలిగా ఉన్నప్పుడు
అరటి ఆకులు చూసి విందుకలలతో విలపిస్తాడు!
సృజించాడట విశ్వాన్ని! రచించాడట జగాన్ని!
పూజిస్తే వరాలివ్వడానికి నేటి నాయకుడా దేవుడు?
దూషిస్తే శపించడానికి మరో మానవుడా దేవుడు?
దైవత్వం కేవలం కల్పన!
అది నాలో భయం, నీలో ఆశ!
వాడి లోపం, వీడి శ్వాస!
ఒకడి నేస్తం, ఒకడి ఊహ!
నారు పెట్టి నీరుపోసి
పైరు పెంచి పంట పంచుకున్న మనిషేగా దేవుడు!
ఉట్టికొట్టి ధారపోసి, వెన్నదించి వేణువూది
నిన్ను హత్తుకున్న మనిషేగా దేవుడు!!

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

ఇంత ధనమును గడియించి యింట నింపి
కన్నులార్పక బ్రతుకెల్ల కాచి కాచి
మించు సంతృప్తినెదనెల్ల నించినాను
ఎల్లలెరుగని ప్రేమ నా యెదను నిండ

ఎందుకీ సంపదలైశ్వర్యమెందుకంచు
కష్టములకెల్ల మూలము కాసులంచు
ఎల్లరును పోరెదరు చెవినిల్లు కట్టి
ప్రేమ విడువక రూకలు విడుచుటెట్లు

కలసి పరలోక సీమకు కదలి రాని
ఈ యిహానంద భాగ్యమ్ములెవరి కొరకు
నేను తరియించుటకు కాదు నిశ్చయమ్ము
స్వాంతమున నేను ప్రేమించు వారి కొరకు

స్వార్థమెరుగని యనురాగవార్ధి నాది
ఎల్ల వేళల ప్రేమించునెడద నాది
ప్రేమ ఫలముల యుద్యాన సీమ నాది
ఏమి యొనరించినను గాని ప్రేమ కొరకె

అర్థమునకర్థమును మదియందు తెలిసి
పంచ చేర్చుకొన్నట్టి సద్భాగ్యమిద్ది
అనుగు వారలు నను వీడి యరిగినపుడు
విడచి సర్వమ్ము దైన్యమ్ము స్వీకరింతు

**Post your comments**